

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఓటరు జాబితాలు తయారు చేస్తున్నారు. 10లో▸



అవగాహన కల్పించండి

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఆమనగల్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప కోరారు. 10లో▸



హైడ్రా పరిధిలోకి..

జంట జలాశయాల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపును పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించే కసరత్తు ప్రారంభమైంది. 10లో▸

రేపు జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర విషయాలపై ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ: జల్‌పల్లి
కమిషనర్: అల్లూరి వాణిరెడ్డి
తేదీ: 2-09-2024 (సోమవారం)
సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
63025 03323

న్యూస్‌రీల్

ఉద్యోగులు పాత పెన్షన్ సాధించుకోవాలి



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: సెప్టెంబర్ 1 అనేది 1,20,000 మంది ఉద్యోగుల పాలిట చీకటి రోజు అని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు యాసాని కరుణాకర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాత పెన్షన్ (ఓపీఎస్)ను తీసేసి దాని స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త స్కీమును తీసుకువచ్చాయని తెలిపారు. ఆ స్కీముతో ఉద్యోగులు పదవీ విరమణ తరువాత వారి జీవితాలపై ఒక అభద్రతా భావం ఏర్పడి మానసిక క్షోభకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్, యూపీఎస్‌ల పేర్లతో కొత్త స్కీములను తీసుకువస్తున్న ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు నిరసన దినం పాటించనున్నట్లు చెప్పారు. పాత పెన్షన్‌ను సాధించుకోవడానికి ప్రతి ఉద్యోగి నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గవర్నర్‌ను కలిసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు పూలమొక్కను బహూకరించారు.

అర్హులందరికీ రుణమాఫీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆమనగల్లు: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ అందిస్తుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీమేరకు రూ.2లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తుందని స్పష్టం చేశారు. చిన్నచిన్న సాంకేతిక కారణాలతో మాఫీ కాని రైతుల కోసం వ్యవసాయాధికారులతో నిర్ధారణ చేసి మాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా ఇప్పటివరకు 34,731 మంది రైతులకు సంబంధించి రూ.206.39 కోట్ల రుణ మాఫీ జరిగిందని తెలిపారు. డీసీసీబీల ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలతో పాటు డెయిరీ, మత్స్యకార రుణాలు సైతం అందిస్తున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ ఆమనగల్లు శాఖ మేనేజర్ గోపాల్, ఫీల్డ్ సూపర్‌వైజర్ రాజు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో జ్వరాలకు చెక్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

'సీజనల్ జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలి.. ప్రతి ఇంట్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను నివారించొచ్చు.. డెంగీ, చికున్ గున్యా, మలేరియా జ్వరాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం.. ఎవరికైనా రెండు రోజులకు మించి జ్వరం ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి' అని షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్‌కు మంచి స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. పలు సలహాలు, సూచనలు చేశారు.

– షాద్‌నగర్

- దోమల వృద్ధి, నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలి
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నిర్మూలన
- షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు మంచి స్పందన

సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– శ్రీశైలంగౌడ్, గాంధీనగర్ కాలనీ, షాద్‌నగర్

డాక్టర్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. దోమలతో డెంగీ, మలేరియా వస్తుంది. కలుషితమైన నీటితో టైఫాయిడ్ వస్తుంది. ప్రతి ఒక్కరూ బయట ఆహారానికి దూరంగా ఉండాలి. ఇంట్లోనే వేడివేడి ఆహారం తినాలి. వంట పాత్రలను ఎప్పుడూ మూసి ఉంచాలి. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా ఉంటారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలాంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు ఉన్నారా?

– శివకుమార్, న్యాయవాది, షాద్‌నగర్

డాక్టర్: షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తున్నాం. వైద్యులతో పాటు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ కోసం కావాల్సిన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నాం. వ్యాధి తీవ్రతను బట్టి పెద్దాస్పత్రికి పంపించడం జరుగుతుంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దు. ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి.



ఫోన్‌లో సలహాలు, సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

జ్వరం వస్తే ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– హబీబ్, షాద్‌నగర్

డాక్టర్: వర్షాకాలంలో దోమలు విజృంభిస్తుంటాయి. సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల లార్వా పెరిగి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర జ్వరాలకు కారణం అవుతుంది. జ్వరం వస్తే ప్లేట్‌లెట్లు తగ్గుతాయి. సాధారణంగా 20వేల కన్నా తగ్గితే ప్రమాదకరం. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

సాక్షి ఫోన్ ఇన్

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏమైనా ఏర్పాటు చేస్తున్నారా?

– శివాజీ, కేశంపేట

డాక్టర్: వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యంపై అందరూ ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వస్తే మెరుగైన వైద్యం లభిస్తుంది.

చికున్‌గున్యాను ఎలా గుర్తించాలి, నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– శ్రీశైలం, ఎలికట్ట

డాక్టర్: దోమకాటుతో చికున్‌గున్యా వస్తుంది. ఈ వ్యాధి వస్తే కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. ఆకస్మికంగా జ్వరం వస్తుంది. వ్యాధి నిర్ధారణకు విధిగా రక్త పరీక్షలు చేయించుకోవాలి. జ్వరం వచ్చిన రెండు రోజుల తర్వాత పరీక్షలు నిర్వహిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయి. దీంతో సరైన చికిత్స అందించవచ్చు. ప్రతి వారం డ్రైడే పాటించాలి. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే దోమలు, ఈగలు వ్యాపించి రోగాలు వస్తాయి. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారా.. కిట్లు అందుబాటులో ఉన్నాయా ?

– లక్ష్మణ్‌కుమార్, షాద్‌నగర్

డాక్టర్: వ్యాధి నిర్ధారణ చేసేందుకు కిట్లు అన్ని అందుబాటులో ఉన్నాయి. వైద్యులు 24 గంటలు అందుబాటులోనే ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారు. డెంగీ వస్తే ప్లేట్‌లెట్లు తగ్గుతాయి. మూడు రోజుల తర్వాత పెరగడం ప్రారంభం అవుతుంది. ప్లేట్‌లెట్లు పెంచేందుకు ప్రత్యేకంగా మందులు ఉండవు. మంచి ఆహారం తీసుకోవాలి. ప్లేట్‌లెట్లు పూర్తిగా తగ్గి వెయ్యి మందిలో ఒకరికి విషమంగా మారే అవకాశాలు ఉంటాయి.

రెండు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో నీరసంగా ఉంటోంది. డెంగీ వచ్చే అవకాశాలు ఉన్నాయా?

– వెంకటేశ్, రాంనగర్ కాలనీ, షాద్‌నగర్

డాక్టర్: జ్వరం వచ్చినప్పుడు భయపడకూడదు. భయం అనేది మనిషిని మానసికంగా ఎంతో దెబ్బతీస్తుంది. ఫలితంగా పూర్తిగా కుంగిపోతారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైరల్ ఫీవర్స్ సాధారణం. పరీక్షలు చేయించుకొని నిర్ధారణ చేసుకుని మందులు వాడాలి. జ్వరం వచ్చినప్పుడు పెరిగిన ఉష్ణోగ్రతకు శరీరంలోని నీరంతా ఆవిరి అవుతుంది. డీహైడ్రేషన్ కారణంగా నీరసం వస్తుంది. నీటిని ఎక్కువగా తాగాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.



చేవెళ్ల: దేవరంపల్లి వద్ద పారుతున్న ఈసీ వాగు

ఎడతెరిపిలేకుండా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లో వాగులు పొంగిపొర్లాయి. చాలాకాలం తర్వాత ఈసీ వాగులోకి వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



షాబాద్: తాళ్లపల్లి వద్ద చెక్‌డ్యాం పైనుంచి నిండుగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శశాంక



ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శశాంక సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు, వరద ప్రాంతాల నుంచి ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. ఉధృతంగా పారే వాగుల వద్ద మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు మ్యాన్‌హోల్ మూతలు తెరవకుండా నిఘా పెట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి పర్యవేక్షించాలని సూచించారు. వరద ప్రాంతాల నుంచి ప్రజలను తరలించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసే విషయంలో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో 040 23237416 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యలు ఎదురైతే సంప్రదించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

రైతు సమస్యలపై పోరాటం

రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం శిక్షణ తరగతులు ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని చింతపల్లిగూడ గేటు సమీపంలో గల శుభం కన్వెన్షన్ హాల్‌లో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండాను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన సమగ్ర ఉత్పత్తి ఖర్చు సీ2 ఆధారంగా కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, వడ్డీతో సహా రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడేలా మార్చాలన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ 2011 చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులిచ్చి రైతు భరోసా కల్పించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన సందర్భంలో నష్టపరిహారం, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ జరిగేటప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, ప్రొఫెసర్ అరబండి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి

తుర్కయంజాల్: వినాయకుడి మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి ఏర్పాటు చేయాలని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు ముందుగానే ఆన్‌లైన్‌లో పోలీస్ శాఖ ఇచ్చిన లింక్ ద్వారా అన్ని వివరాలు సమర్పించాలని తెలిపారు. దీంతో ఏర్పాటు చేయబోతున్న విగ్రహం ఎత్తు, ఏ తేదీ, ఏ సమయంలో నిమజ్జనం చేస్తారు అనే విషయాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ఆ రోజు సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడానికి అన్ని శాఖల అధికారులకు సమయం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువులో 2వేలకు పైగా గణనాథులు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు మాట్లాడుతూ.. నిమజ్జన ప్రక్రియను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సూచించిన మేరకే ముగించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, సీఐ రాఘవేందర్ రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, నాయకులు బచ్చిగళ్ల రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

కందుకూరు ఆర్డీఓకు వీడ్కోలు

కందుకూరు: కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. తహసీల్దార్లు గోపాల్, ముంతాజ్, ఎంపీడీఓలు సరిత, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

మళ్లీ టోల్ బాదుడు

- రాయికల్ టోల్ ప్లాజాలో రుసుము పెంపు
- పెరిగిన ధరలు నేటి నుంచి అమల్లోకి
- వాహనదారులకు తప్పని ఆర్థిక భారం

షాద్‌నగర్: టోల్ ప్లాజా రుసుములు ఏటా పెరుగుతున్నాయి. ఫలితంగా వాహనదారులపై అదనపు భారం పడుతోంది. ట్రక్కు, బస్సు, మల్టీ ఆక్సిల్ (అనేక చక్రాలు) వాహనాలకు ఈ ఏడాది స్వల్పంగా రుసుము పెంచారు. టోల్ ప్లాజాలో రుసుములు పెరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ – బెంగళూరు 44వ జాతీయ రహదారిపై షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్‌ప్లాజాలో టోల్ రుసుము పెంచారు. పెంచిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి రానున్నాయి.

ప్రయాణికులపై మరింత భారం

బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణించే వారిపై మరింత భారం పెరుగుతుంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం టోల్ ధరలు పెంచుతుండటతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్‌ప్లాజాలో ధరల పెంపు సరికాదని, జాతీయ రహదారిపై వాహనదారులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటా పెరుగుడే..

షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వరకు ఉన్న జాతీయ రహదారిని (సుమారు 58 కిలోమీటర్లు) రూ.600 కోట్లతో విస్తరించి అవసరమైన చోట బైపాస్ నిర్మించారు. ఈ జాతీయ రహదారిని 2009లో కొత్తూరులో ప్రారంభించారు. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ గ్రామ శివారులో నిర్మించిన టోల్‌ప్లాజాలో ఏటా టోల్ రుసుము పెంచుతూ వస్తున్నారు. దీంతో బెంగళూరు –హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణం మరింత భారం కానుంది. పెంచిన రుసుములు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.

నెలవారీ పాసుల ధరలు

టోల్ ప్లాజాలో వాహనాలకు నెలవారీ పాసులు జారీ చేస్తున్నారు. కారు, ప్యాసింజర్, జీపు లేక వ్యానుకు రూ.2,465, లైట్ కమర్షియల్ వాహనాలు, మినీ బస్సులకు రూ.4,315, ట్రక్కు, బస్సుకు రూ.8.630, మల్టీయాక్సిల్ వాహనాలకు రూ.13,865 వసూలు చేయనున్నారు. స్కూల్ బస్సులకు రూ.వెయ్యి వసూలు చేస్తారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

టోల్‌గేట్‌లో ట్రక్కు, బస్సులకు ఒకవైపు ప్రయాణానికి గత ఏడాది రూ.285 వసూలు చేస్తే ఈసారి రూ.290 వసూలు చేయనున్నారు. మల్టీయాక్సిల్ వాహనం (అనేక చక్రాలు) రానుపోను ప్రయాణానికి గత ఏడాది రూ.690 వసూలు చేస్తే ఈసారి రూ.695కు పెంచారు.




రాయికల్ టోల్‌ప్లాజా

నేటి నుంచి వసూలు చేయనున్న టోల్ రుసుము

వాహనం	ఒకవైపు ప్రయాణం	రానుపోను ప్రయాణం
కారు, జీపు ప్యాసింజర్ వ్యాన్	రూ. 80	రూ.125
లైట్ కమర్షియల్, మినీబస్	రూ.145	రూ.215
ట్రక్కు, బస్సు	రూ.290	రూ.430
మల్టీయాక్సిల్ వాహనాలు	రూ. 460	రూ.695

రవాణా రంగంపై ప్రభావం



రవాణా రంగంపై ఆధార పడి ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, టోల్ రుసుములు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. టోల్ రుసుము పెంపుతో వాహనదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

– సయ్యద్ సాధిక్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

స్వల్పంగా పెరిగాయి

టోల్ ప్లాజాలో స్వల్పంగా రుసుములు పెరిగాయి. బస్సు, ట్రక్కు ఒక వైపు ప్రయాణానికి, మల్టీయాక్సిల్ వాహనం రానుపోను ప్రయాణానికి ఐదు రూపాయల చొప్పున పెంచడం జరిగింది. పెరిగిన ధరలు సెప్టెంబర్ 1 నుంచి వసూలు చేయడం జరుగుతుంది.

– ఇబ్రహీం, టోల్‌ప్లాజా మేనేజర్, షాద్‌నగర్

హైడ్రా పరిధిలోకి జంట జలాశయాలు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు ఇక మహర్దశ

జలమండలి నుంచి హైడ్రాకు పరిరక్షణ బాధ్యత

- అక్రమ కట్టడాలకు నోటీసులు, తొలగింపు అధికారాలు
- అమల్లోకి వస్తే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు మహర్దశ

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పరిరక్షణ బాధ్యత హైడ్రా పరిధిలోకి తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో జంట జలాశయాలపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో కూల్చివేతలపై రెవెన్యూ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ తదితర శాఖలు నోటీసులు ఇవ్వడంతో గందరగోళం తలెత్తింది. దీంతో పాటు ఇటీవల హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ హైడ్రాకు మరిన్ని అధికారాలు, సిబ్బందిని అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జంట జలాశయాల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపునకు పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించే కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే హైడ్రా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలను కూల్చివేసింది. తాజాగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సిద్ధమైంది.

కుంచించుకుపోతున్న జలాశయాలు..

దాదాపు వందేళ్లుగా మహా నగర దాహార్తిని తీరుస్తూ.. ఇటు వరదల నుంచి రక్షణ కల్పిస్తూ.. ఆపద్బాంధవులుగా ఉన్న జంట జలాశయాలు ఆక్రమణల పర్వంతో విలవిల్లాడుతున్నాయి. కబ్జాలు, అక్రమ నిర్మాణాలతో రిజర్వాయర్లలోకి నీళ్లు వచ్చే మార్గాలు మూసుకుపోయి కుంచించుకుపోతున్నాయి. 111 జీఓ నిబంధనలను తోసిరాజంటూ పరీవాహక ప్రాంతంలో భారీగా నిర్మాణాలు వెలిశాయి. ప్రధానంగా 2002 నుంచి ఆక్రమణలు, అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయి. కొత్త నిర్మాణాలపై నిషేధమున్నా.. వందల కొద్దీ రియల్ ఎస్టేట్ వెంచర్లు, వేలకొద్దీ విల్లాలు, నివాస సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలేజీలు, వాణిజ్య భవనాలు పుట్టుకొచ్చాయి. ఫలితంగా జంట జలాశయాలకు వరద నీటిని చేర్చే కాల్వలు (ఇన్‌ఫ్లో చానల్స్) కబ్జాకు గురవడం, ఆ ప్రాంతాలు ఫాంహౌస్లు, ఇంజినీరింగ్ కళాశాలలు, గోడౌన్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలతో పాటు ఇటుక బట్టీలు, ఇసుక మాఫియాకు అడ్డాలుగా మారడంతో జలాశయాలు చిన్నబోతున్నాయి.

వేల సంఖ్యలో కబ్జాలు..

జంట జలాశయాల పరిరక్షణ అంశంలో జలమండలి, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేక పరిస్థితి చేయి దాటింది. జలాశయాల పరిరక్షణకు ఉద్దేశించిన 111 జీఓకు తూట్లు పొడుస్తూ పరీవాహకం పరిధిలో ఒకటీ.. రెండూ కాదు.. వేల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. మూడేళ్ల క్రితం రెవెన్యూ శాఖ జీఓ వర్తించే ఆరు మండలాల పరిధిలోని 84 గ్రామాల్లో సర్వే నిర్వహించింది. మొత్తంగా 426 లేఅవుట్లలో 10,907 ఇళ్లు.. గ్రామాల్లో 4,567 ఇళ్లు, 1,920 వాణిజ్య భవనాలు అక్రమంగా నిర్మితమై ఉన్నట్టు బహిర్గతమైంది. ఇందులో కాలేజీలు, ఫంక్షన్ హాళ్లు, ఫామ్ హౌస్‌లు, గోదాములను రెవెన్యూ అధికారులు గుర్తించి అప్పట్లో హడావుడి చేశారు. శంషాబాద్ పరిధిలో కొన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తర్వాత రాజకీయ పెద్దల జోక్యంతో వెనకకు తగ్గారు. జంట జలాశయాల పరిరక్షణ కోసం నిపుణులతో లేక్ ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటు చేయాలని గతంలోనే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది కానీ కార్యరూపం దాల్చలేదు. శిఖం భూముల్లో అక్రమంగా వెలసిన ఫాంహౌస్ కాలేజీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లను తొలగించడంలో తాత్సారం చేసింది.

అమలుకు నోచుకోని జీఓ..

జంట జలాశయాల పరిరక్షణ కోసం ఉమ్మడి రాష్ట్రంలోనే 111 జీఓను అమల్లోకి వచ్చింది. ఈ జలాశయాలకు చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో భారీ శాశ్వత నిర్మాణాలపై నిషేధం విధించింది. కాలుష్య కారక పరిశ్రమలు, నివాస కాలనీలు, భారీ హోటళ్లు, రెస్టారెంట్లు, కాలేజీలు, ఇతర సంస్థలు వంటివేవీ ఉండకూడదనే నిబంధన పెట్టింది. ఈ ప్రాంతం పరిధిలో వేసే లేఅవుట్లలో 60 శాతం ఓపెన్‌గా రోడ్ల కోసం వదలాలి. వినియోగించే భూమిలో 90 శాతం మొక్కల పెంపకానికి కేటాయించాలి. భవనాలేవీ గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులకు మించి నిర్మించడానికి వీల్లేదు. కానీ ఎక్కడా ఈ ఆంక్షలు అమలు కాలేదు.

చెరువుల్లో సైతం..

హిమాయత్‌సాగర్ పరిధిలో శిఖం భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. ప్రధానంగా అజీజ్ నగర్, నాగిరెడ్డిగూడ, హిమాయత్‌సాగర్, కొత్వాల్‌గూడ, కుర్మగూడ, నర్కుడ గ్రామాల పరిధిలో సుమారు 50 ఎకరాలు పరాధీనమైనట్టు రెవెన్యూ శాఖ లెక్క తేల్చింది. వాస్తవంగా దాని కంటే మూడు నాలుగింతలు అధికంగా ఉంటుందన్న అంచనా. ఇక ఉస్మాన్ సాగర్ పరిధిలోని ఖానాపూర్, గున్‌గుర్తి, గండిపేట్, శంకర్‌పల్లి, జన్వాడ పరిధిలో సుమారు 300 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. తాజాగా హైడ్రా పరిధిలోకి రానుండటంతో జంట జలాశయాలకు మహర్దశ పట్టే అవకాశం లేకపోలేదని నిపుణులు పేర్కొంటున్నారు.



బందూక్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ తల్లి త్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ

నివాళి

మంచాల: బందూక్ చిత్ర దర్శకులు మురారిశెట్టి లక్ష్మణ్‌ను తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మురారిశెట్టి లక్ష్మణ్ తల్లి రాములమ్మ దశదినకర్మకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రైల్వే బోర్డు మెంబర్ కేవీ రమేష్‌రాజ్, కేసీఆర్ పీఆర్ఓ రమేష్ హజారీ, నాయకులు యుంగేధర్‌రావు, సతీష్ రెడ్డి, మదాస్ రమేష్, సుమిత్ర, సినీ నిర్మాత కొణతం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



తలకొండపల్లిలో పీఏసీఎస్ గోదాంను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: రైతులను రుణ విముక్తులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రూ.76లక్షల నాబార్డ్ నిధులతో మండల కేంద్రంలో వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వసామర్థ్యమున్న పీఏసీఎస్ గోదాం నిర్మించారు. శనివారం పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఆధ్వర్యంలో గిడ్డంగి ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీలో 8వేల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారని.. సభ్యుల సంఖ్యను పెంచాలన్నారు. సహకార సంఘాల బలోపేతం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల, షాద్‌నగర్ మండలాల్లోని సహకార సంఘాలను జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు.

'పాలమూరు–రంగారెడ్డి'పూర్తయితే..

అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారని.. వారి శ్రేయస్సుకు గిడ్డంగి నిర్మించడం సంతోషదాయకమన్నారు. రైతుల మేలు కోసం పని చేసే వ్యక్తి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అని.. ఆయన కృషి ఫలితంగానే గోదాం నిర్మాణం జరిగిందని అభినందించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే గిడ్డంగులు అవసరమవుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కేఎల్ఐ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అనంతరం గోదాంకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేశరెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు గట్ల కేశవరెడ్డి, వెంకటేష్, పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, రేణురెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాం, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ అనిల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సింగిల్‌విండో సీఈఓ ప్రతాప్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు

ఓటరు జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు



ఓటరు జాబితా కంప్యూటరీకరణ విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వార్డుల వారీగా ఓటరు జాబితాలను తయారు చేస్తున్నారు. ఒకే కుటుంబంలోని వ్యక్తుల ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉండడంతో వాటిని సరిచేస్తున్నారు. గ్రామ పంచాయతీల వారీగా పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో కలిసి ఓటరు జాబితాలను తయారు చేసి దాన్ని కంప్యూటరీకరిస్తున్నారు. సెప్టెంబర్ 6న గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించనున్నారు. శనివారం మండల అభివృద్ధి అధికారి సంధ్య చిలుకూరు గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణను పరిశీలించారు. కంప్యూటర్‌లో పొందుపరుస్తున్న విధానాన్ని పరిశీలించి వార్డుల వారీగా తప్పులు జరగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఇతర సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

పరుగు పందెంలో 'నిత్య' ప్రతిభ

వంద మీటర్ల పోటీలో గోల్డ్‌మెడల్



షాద్‌నగర్: జాతీయ స్థాయి పరుగు పందెం పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన యువతి ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. బెంగుళూరులో 63వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం చాంపియన్‌షిప్ పోటీల్లో నిర్వహించిన వంద మీటర్ల పరుగు పందెంలో షాద్‌నగర్‌కు చెందిన గందె నిత్య ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆవోపా(ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ నిత్యను ప్రత్యేకంగా అభినందించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వరూప

ఆమనగల్లు: లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఆమనగల్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పోలీసు అధికారులతో సెప్టెంబర్ 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వరూప మాట్లాడుతూ.. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల రాజీ కోసం నిర్వహించే లోక్‌అదాలత్ కార్యక్రమం గురించి పోలీసులు ప్రచారం నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్, మాడ్గుల సీఐ జగదీశ్, ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై ఆర్డీఓకు ఫిర్యాదు

నందిగామ: పట్టా భూమికి సంబంధించి నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేస్తే తహసీల్దార్ పట్టించుకోవడం లేదని శనివారం ఓ మహిళ ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది. మండలంలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన కావలి లతకు చేగూరు గ్రామ శివారులో సర్వే నెంబరు720/ఉ/ఆ/1/2/2 లో రెండు గుంటల భూమి ఉంది. ఈ భూమి కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ రాజేశ్వర్ పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కన్వర్షన్‌కు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

కొత్తూరు: జేపీ దర్గాలో చోటుచేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని కొత్తూరు సీఐ నర్సింహ్మారావు తెలిపారు. ఆయన వివరాలు ఇలా ఉన్నాయి. జేపీ దర్గా ప్రధాన కాంట్రాక్టర్ ఖాజాపాషా వద్ద ఇదే ప్రాంతానికి చెందిన సయ్యద్ రఫీక్ సబ్ కాంట్రాక్టర్‌గా మెయింటెనెన్స్ పనులు తీసుకున్నాడు. అయితే ఓ టీవీ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్న ఫయాజ్ తనతో పాటు స్థానికంగా ఉండే తన వర్గం వారికి రూ.5 లక్షలు (మామూళ్లు) ఇవ్వాలని కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలిగిస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఫయాజ్‌కు సంబంధించిన వ్యక్తులు దర్గా ఆవరణలో రఫీక్, ఇతనికి చెందిన వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. దీంతో రఫీక్‌తో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే రోజు సాయంత్రం గొడవ విషయమై ఫయాజ్ తన మామ అయిన షౌకత్, నవాజ్‌లతో కలిసి రఫీక్, అతడి వర్గీయులతో మాట్లాడుతుండగా.. పాత కక్షల నేపథ్యంలో రఫీక్ వర్గీయులు ఫయాజ్‌తో పాటు అతడి బ్యాచ్‌పై దాడికి పాల్పడ్డారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బోనాల పండుగకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలిలో శివ మృతదేహం

యాచారం: బోనాల పండుగకు స్నేహితుడికి ఇంటికి వెళ్లి వస్తుండగా జోరు వర్షంలో జరిగిన ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా.. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల గ్రామానికి చెందిన లలిత, కృష్ణయ్య దంపతులకు శివ(22) ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉండే శివ నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని తన స్నేహితుడి ఇంట్లో బోనాల పండుగకు మరో స్నేహితుడు తేజతో కలిసి బైక్‌పై వెళ్లారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత ఇబ్రహీంపట్నం బయలుదేరారు. మార్గమధ్యలో సాగర్ హై వేపై చౌదర్‌పల్లి గేట్ సమీపంలోరోడ్డుపై నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో శివ తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రుడు తేజను చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. ఈ ఘటన శనివారం ఆదిబట్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపి న ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన బిశ్వజిత్ మధు(31), సంతోష్ సర్కార్(78) కొన్నేళ్లుగా గంజాయి విక్రయిస్తున్నారు. ఠాణా పరిధిలో కొంగరకలాన్ లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో పనిచేస్తున్న వారికి ఒడిశా నుంచి తీసుకు వచ్చిన గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు, ఆది బట్ల పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నా రు. సంతోష్ సర్కార్ పలుమార్లు గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సరికొత్త 'మత్తు'

బంజారాహిల్స్: డ్రగ్స్, గంజాయికి బానిసలైన ఐదుగురు మిజోరాం రాష్ట్ర యువతీ యువకులు నిద్ర మాత్రలను పొడిగా చేసుకుని ఇంజెక్ట్ చేసుకుని మత్తులో జోగుతూ బంజారాహిల్స్ పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. మిజోరాంకు చెందిన ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని శ్రీరాంనగర్ బస్తీలో నివాసం ఉంటూ సెలూన్లు, స్పా సెంటర్లలో బ్యూటీషియన్లు, థెరపిస్టులుగా పని చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయికి బానిసలైన వారు నిద్ర మాత్రలైన నెట్రావెట్ ట్రామా జాక్, టైడోల్ తదితరాలను కుషాయిగూడలోని ఓ మెడికల్ షాప్ నుంచి కొనుగోలు చేసుకుని వచ్చి పొడి చేసి నీళ్లల్లో కలిపి ఇంజెక్ట్ చేసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వారి గదిపై దాడి చేయగా ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు స్పృహ లేకుండా మత్తులో కనిపించడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అబ్రహం, లాత్ రుక్కి, రిక్కీ, లాల్ రెడ్కి, కేథరిన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు సంజీవ, లాల్ నున్పియా, డేవిడ్ తదితరులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.